క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చీమకుర్తి రూరల్: మండలంలోని 11 కేవీ దేవరపాలెం ఫీడర్ పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ లైన్ల కింద చెట్లు తొలగించేందుకు మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఆర్.మోహన్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవరపాలెం, బక్కిరెడ్డిపాలెం గ్రామాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు గమనించి సహకరించాలి కోరారు.

నేడు విద్యుత్ వినియోగదారుల అదాలత్

కంభం: స్థానిక ఏబీ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ వినియోగదారుల అదాలత్ నిర్వహించనున్నట్లు డీఈఈ శ్రీనివాసరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించుకునేందుకు ఈ అదాలత్ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమానికి జిల్లా జడ్జి చైర్‌పర్సన్ ఎస్.విక్టర్ ఇమ్మానియేల్, సాంకేతిక సభ్యులు శ్రీనివాసరావు, ఆర్థిక సభ్యులు ఆర్సీహెచ్.శ్రీనివాసరావు, జిల్లా పర్యవేక్ష అధికారి కె.వెంకటేశ్వర్లు, స్వతంత్ర సభ్యులు సునితలు పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు.

పోటీ పరీక్షలు విద్యార్థులకు మేలు

గిద్దలూరు రూరల్: పోటీ పరీక్షలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రజాపిత బ్రహ్మకుమారి ప్రతినిధి సావిత్రి అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని పట్టణంలోని గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న మేధాశక్తిని పెంపొందించుకునేందుకు పోటీ పరీక్షలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో గ్రంథపాలకురాలు ప్రసన్నకుమారి, తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన ఇద్దరికి జైలు

గిద్దలూరు రూరల్: మద్యం తాగి వాహనాలు నడిపిన ఇద్దరికి కోర్టు జైలు శిక్ష విధించింది. గిద్దలూరు అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి భరత్‌చంద్ర మద్యం తాగి వాహనాలు నడిపిన ఇద్దరికి రూ.10 వేల జరిమానాతో పాటుగా రెండు రోజుల పాటు జైలు శిక్ష విధిస్తున్నట్లు సోమవారం తీర్పునిచ్చారు. స్థానిక సీఐ కే సురేష్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు నిర్వహించిన పోలీసులకు మద్యం తాగి వాహనాలు నడుతున్న ఇద్దరు పట్టుబడ్డారు. వారిపై కేసులు నమోదు చేసిన పోలీసులు కోర్టులో జడ్జి ఎదుట హాజరు పరిచారు. వారికి జైలు శిక్షతోపాటు జరిమానా విధించారు.

ఉప్పు రైతు విలవిల

- వరుసగా అకాల వర్షాలతో కరిగిపోయిన ఉప్పు
- ప్రస్తుతం నైరుతీ రుతుపవనాలతో మళ్లీ వర్షాల ముప్పు
- ఈ ఏడాది భారీ నష్టాలంటూ రైతుల ఆవేదన


కొత్తపట్నంలో వర్షం నీటిలో మునిగి ఉప్పు కరిగిపోయిన కొఠార్లు

కొత్తపట్నం: గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ఉప్పు రైతులు నష్టాలు చవిచూశారు. మే నెలలో అకాల వర్షాలకు ఉప్పు మడులన్నీ కరిగిపోయాయి. ప్రస్తుతం నైరుతీ రుతుపవనాల రాకతో మళ్లీ వర్షాలు ప్రారంభంకానున్నాయి. దీంతో భారీ నష్టాలు తప్పేలా లేవని ఉప్పు రైతులు తీవ్రస్థాయిలో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్తపట్నం మండలంలోని కొత్తపట్నం, బీరంగుంట, గుండమాల, మోటుమాల గ్రామాల్లో సుమారు 2 వేల ఎకరాల్లో ఉప్పు సాగు చేస్తున్నారు. పది వేల నుంచి పదిహేను వేల మంది ఉప్పు కొఠారులపై ఆధారపడి జీవిస్తున్నారు. ఏడాదిలో ఎనిమిది నెలల పాటే వారికి ఉపాధి లభిస్తుంది. ప్రతి ఏడాది రోహిణీకార్తెలో ఎక్కువగా ఉప్పు ఉత్పత్తి జరుగుతుంది. మే, జూన్ నెలల్లో అధిక ఉత్పత్తిని ఉప్పు రైతులు ఆశిస్తారు. కానీ, ఈ ఏడాది విచిత్రంగా మే నెలలో అకాల వర్షాలు కురిసాయి. దీంతో భూమి చల్లబడి ఉప్పు ఉత్పత్తి ఆగిపోయింది. మే, జూన్ నెలల్లో ఉప్పు ఉత్పత్తి ఎక్కువగా వస్తుందని, లాభాలు వస్తాయని ఆశించిన రైతులకు నిరాశ మిగిలింది. గతంలో ఉన్న ఉప్పును తక్కువ ధరలకు అమ్ముకున్నారు. కానీ, వాతావరణ పరిస్థితులు తారుమారు కావడం, అడపాదడపా వర్షాలు పడటం వలన ఉప్పుమడుల్లో బురదనీరు చేరి ఉత్పత్తి లేకుండా పోయింది. ఇప్పటి వరకూ ఉపరితల ఆవర్తనాలు, ఇప్పటి నుంచి నైరుతీ రుతుపవనాల ప్రభావంతో తమ పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందని ఉప్పు రైతులు వాపోతున్నారు. ఈ ఏడాది తమ ఉపాధికి కోలుకోలేని దెబ్బ తగిలిందని కూలీలు సైతం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉప్పు కొఠారులకు ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని ఉప్పు రైతులు కోరుతున్నారు.

కాంట్రాక్టు కార్మికులకు పథకాలు అమలు చేయాలి

ఒంగోలు టౌన్: మున్సిపల్ పారిశుధ్య కార్మికులు, ఇంజినీరింగ్ కార్మికులకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయాలని సీఐటీయూ నగర కార్యదర్శి టి.మహేష్ డిమాండ్ చేశారు. ఆ మేరకు సోమవారం నగరపాలక సంస్థలోని కమిషనర్ కార్యాలయంలో ఎంహెచ్ఓ డాక్టర్ వైష్ణవికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ పట్టణాలు, కార్పొరేషన్లలో ప్రజారోగ్య సంరక్షణలో కీలక విధులు నిర్వహిస్తున్న కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయకపోవడంతో తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. కార్మికుల ఇళ్లలో ఉన్న ఒంటరి మహిళలు, 60 ఏళ్లు దాటిన వృద్ధులకు ప్రభుత్వం ప్రకటించిన పెన్షన్లు రావడం లేదని తెలిపారు. నిత్యావసర ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచకపోవడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు కూడా అందజేయకపోవడంతో చిరుద్యోగులు సమస్యల్లో పడుతున్నారని చెప్పారు. పారిశుధ్య కార్మికుల బాధలను గుర్తించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ అండ్ వర్కర్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు టి.విజయమ్మ, నరసింహ, కె.సామ్రాజ్యం, ఆర్.శ్రీనివాసరావు, కె.గోపి, యాకోబు, వంశీ, సంతోషమ్మ తదితరులు పాల్గొన్నారు.

తెరుచుకున్న వెల్లంపల్లి సినిమా థియేటర్


థియేటర్ తాళాలు తీస్తున్న రెవెన్యూ అధికారులు

మద్దిపాడు: మండలంలోని వెల్లంపల్లిలో జీఎంఆర్ సినిమా థియేటర్‌కు వేసిన సీల్‌ను సోమవారం రెవెన్యూ అధికారులు తొలగించారు. గతంలో ఉన్న రైస్ మిల్లును సినిమా థియేటర్‌గా నిర్వాహకులు మార్చివేసి నిర్వహణ కోసం అనుమతులు పొందారు. వాటిని పరిశీలించిన ఒంగోలు ఆర్డీఓ లక్ష్మీ ప్రసన్న ఆదేశాల మేరకు సోమవారం తహసీల్దార్ వేమూరి ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది థియేటర్ సీజ్ తొలగించి తాళాలు తీశారు. కార్యక్రమంలో ఆర్ఐ రమణయ్య, వీఆర్వో పూజిత, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ త్వరలోనే థియేటర్‌ను ప్రారంభిస్తామని తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన అధికారులు


బాధ్యతలు స్వీకరిస్తున్న రమణబాబు

గిద్దలూరు రూరల్: పట్టణ మున్సిపల్ కమిషనర్‌గా ఈవీ రమణబాబు మున్సిపల్ కార్యాలయంలో సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గిద్దలూరులో కమిషనర్‌గా పనిచేసిన ఐ.శ్రీనివాసులును పిడుగురాళ్లకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నందిగామలో కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న రమణబాబును ఇక్కడకు బదిలీ చేశారు. ఈసందర్భంగా కార్యాలయ సిబ్బందితో పాటు చైర్మన్, కౌన్సిలర్లు, పలువురు ఆయనను కలిసి అభినందనలు తెలిపారు.

ఉన్నగురువాయుపాలెం పశువైద్యాధికారిగా బ్రహ్మయ్య

పొదిలి రూరల్: మండలంలోని ఉన్నగురువాయుపాలెం పశువైద్యాధికారిగా డాక్టర్ బ్రహ్మయ్య బాధ్యతలు స్వీకరించారు. బ్రహ్మయ్య మర్రిపూడి పశువైద్యాధికారిగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటి దాక ఇక్కడ పశువైద్యాధికారిగా పని చేసిన డాక్టర్ మంచికల మణిశేఖర్ మర్రిపూడి మండలానికి బదిలీ అయ్యారు. పొదిలి వ్యవసాయాధికారిగా దేవిరెడ్డి శ్రీనివాసులురెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఈయన మార్కాపురం ఏవోగా పని చేస్తూ బదిలీపై ఇక్కడ వచ్చారు. పొదిలి ఏవోగా పని చేస్తున్న జైన్‌లాబ్దిన్ బదిలీపై వెళ్లారు.

మార్కాపురం ఏవోగా బుజ్జిబాయి


బుజ్జిబాయి, ఏవో

మార్కాపురం: మార్కాపురం వ్యవసాయశాఖ అధికారిగా బుజ్జిబాయి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె పెద్దారవీడు మండలం వ్యవసాయశాఖ అధికారిగా పనిచేస్తూ బదిలీపై మార్కాపురం వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన ఏఓ దేవిరెడ్డి శ్రీనివాసులు పొదిలికి బదిలీపై వెళ్లారు.

కాటమరాజు దేవాలయ అభివృద్ధికి కృషి


కమిటీ సభ్యులకు నాగాభరణం అందిస్తున్న పీఎల్పీ యాదవ్

మార్కాపురం: వేణుాతల కాటంరాజు దేవాలయ అభివృద్ధికి కృషిచేస్తామని దేవస్థాన కమిటీ చైర్మన్ గుమ్మా గంగరాజు యాదవ్, ముఖ్య ప్రతినిధి పీఎల్పీ యాదవ్‌లు తెలిపారు. సోమవారం పట్టణ బీసీ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాటమరాజు గంగాభవానీ ఆలయ పునర్నిర్మాణ కార్యక్రమానికి వివిధ ప్రాంతాల యాదవులు, భక్తుల సహకారం తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. తమవంతు వాటాగా రూ.1 కోటి దేవదాయ, ధర్మదాయశాఖ వారికి జమ చేస్తే మరో రూ.2 కోట్లు ఆ శాఖ తరుపున వారు కేటాయిస్తారన్నారు. పైవిషయంపై సంబంధిత అధికారులతో మాట్లాడామని తెలిపారు. అన్ని ప్రాంతాల వారికి ప్రాతినిధ్యం కలిస్తూ ఆలయ కమిటీలో వివిధ హోదాల్లో స్వచ్ఛందంగా సేవలు అందించేవారిని గుర్తించి పదవులు పంపిణీ చేస్తామని తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోనే కాకుండా కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి వచ్చే భక్తుల సహకారాన్ని కూడా పొందాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఆలయ అభివృద్ధి, భోజనశాలను పరిశీలించిన పలు రాష్ట్రాల భక్తులు చూసి తమ వంతు సహకారం అందిస్తామని ముందుకు వచ్చినట్లు వారు తెలిపారు. ఆలయ పరిసరాల్లో ఉన్నటువంటి శివునికి వెండి నాగాభరణాన్ని కమిటీ అధ్యక్షులు గుమ్మా గంగరాజుకు అందచేస్తున్నట్లు పీఎల్పీ యాదవ్ తెలిపారు. ఈసందర్భంగా కొందరిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకొని వారికి నియామక పత్రాలు అందజేశారు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శిగా బుర్రి చిన్న వెంకటేశ్వర్లు యాదవ్, ఎం గురుప్రసాద్ యాదవ్, ఒంటేరు నాగేశ్వరరావు యాదవ్, ఉపాధ్యక్షుడిగా పాముల పోలురాజు యాదవ్, గంగుల ఎల్లయ్య యాదవ్, బండి రాజగోపాల్ యాదవ్, మెట్ల చెంచయ్య యాదవ్, ఈర్ల ఎర్రయ్య యాదవ్, పాముల పోలురాజు యాదవ్ తదితరులను నియమించారు. కార్యదర్శులుగా కాయకాకుల శ్రీనివాసులు యాదవ్, బి కృష్ణమూర్తి యాదవ్, ఓ లక్ష్మీ నారాయణ యాదవ్‌లను ఎన్నుకన్నారు.

కంభం ఎస్టీవోగా ముత్యం


ఎస్టీవోగా బాధ్యతలు స్వీకరించిన ముత్యం

కంభం: కంభం ఎస్టీవోగా పీముత్యం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. యర్రగొండపాలెం ఎస్టీవోగా పనిచేసి బదిలీపై కంభం వచ్చిన సందర్భంగా ఆయనను ఎన్జీవో సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. అలాగే మార్కాపురం డివిజనల్ కార్యాలయంలో సీనియర్ అకౌంటెంట్‌గా పనిచేస్తున్న షేక్.మస్తాన్‌వలి కంభం సబ్ ట్రెజరీ కార్యాలయంలో విధుల్లో చేరారు.

డిప్యూటీ తహసీల్దార్‌గా భారతిబాయి


డీటీకి అభినందనలు తెలుపుతున్న సిబ్బంది

బేస్తవారిపేట: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా జీ భారతిబాయి సోమవారం బాధ్యతలు చేపట్టారు. రాచర్ల మండల రీ సర్వే డీటీగా విధులు నిర్వహిస్తూ బదిలీపై బేస్తవారిపేటకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న డీటీ షేక్ పర్వీన్ అర్ధవీడు మండల డీటీగా బదిలీ చేశారు. నూతన డీటీని తహసీల్దార్ జితేంద్రకుమార్, ఎంఆర్ఐ షేక్ సలీం, వీఆర్వోలు, వీఆర్ఏలు, కార్యాలయ సిబ్బంది శాలువ, పూలమాలలతో సన్మానించారు.

విద్యార్థినికి అభినందనలు


విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

తర్లుపాడు: పదిలో ప్రతిభ చాటిన విద్యార్థిని అభినందించారు. మండలంలోని మీర్జపేట జెడ్పీ హైస్కూల్‌లో చదివిన పదో తరగతి విద్యార్థిని ఆర్ ప్రవల్లిక పదో తరగతి పరీక్షల్లో 565 మార్కులు సాధించి కలెక్టర్ చేతుల మీదుగా ప్రతిభా అవార్డు అందుకున్న నేపథ్యంలో సోమవారం గ్రామస్తులు, పాఠశాల సిబ్బంది ఘనంగా సన్మానించి అభినందనలు తెలియచేశారు. బాగా చదువుకుని ఉన్నత స్థానంలో స్థిరపడాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎ ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వాన పడితే చాలు.. వెతలే!


పాతపాడులో ఓ వీధి దుస్థితి ఇలా..


పెదారికట్లలో రోడ్డు పక్కన నిల్వ ఉన్న చెత్తాచెదారం

కొనకనమిట్ల: మామూలుగానే ఆ రహదారులు అంతంత మాత్రమే. మరి కొద్దిపాటి వర్షం పడితే చాలు ఇక అంతే. మండలంలోని గొట్లగట్టు, పెదారికట్ల, గనివానిపాడు, పాతపాడు గ్రామాల్లో అంతర్గత రహదారులు అధ్వానంగా ఉన్నాయి. ఇటీవల రోజుమార్చి రోజు వర్షం పడటంతో రహదారులు చిత్తడిగా మారాయి. వాతావరణ ప్రభావంతో ఇటీవల కొన్ని రోజులుగా జల్లులతో కూడిన కొద్దిపాటి వర్షం పడుతున్నపటికి రెండు రోజులగా పలు గ్రామాల్లో కొద్దిపాటి వర్షం పడింది. దీంతో పలు మట్టిరోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. వర్షం నీరు నిల్వ ఉండడంతో మురికిగా మారి దోమలు వ్యాప్తి చెందడంతో పాటు దుర్వాసన వెదజల్లుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ఆయా వీధులను సిమెంటు రోడ్లుగా అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు హెచ్ఎం ఎంపిక


యోగా శిక్షణలో పాల్గొన్న హెచ్ఎం మస్తాన్

కొనకనమిట్ల: రాష్ట్రస్థాయి యోగా పోటీలకు మండలంలోని వెలిగండ్ల ఎంపీపీ మోడల్ స్కూల్ సీస్ హెచ్ఎం డాక్టర్ షేక్ గుంటూరు మస్తాన్ జిల్లా తరపున ఎంపికయ్యారు. 21 తేదీ అమరావతిలో యోగా పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు పొదిలి పురపాలక సంఘం నుంచి గత వారం జిల్లా యోగా పోటీలకు ఎంపికయ్యారు. అక్కడ యోగాలో నైపుణ్యం ప్రదర్శించిన మస్తాన్‌ను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా మస్తాన్ మాట్లాడుతూ పొదిలి మున్సిపల్ కమిషనర్ కెఎల్ నారాయణరెడ్డి యోగా పోటీలకు ఎంపికయ్యేలా ఇప్పించిన యోగా శిక్షణ రాష్ట్రస్థాయిలో పాల్గొనేందుకు దోహదపడిందన్నారు. నిత్యం యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. యోగ వలన చక్కటి ఆరోగ్యం, శరీర దృఢత్వం పాటు మానసిక ఒత్తిడి దూరమవుతుందన్నారు. ఈసందర్భంగా పలువురు మస్తాన్‌ను పలువురు అభినందించారు.

నేత్రపర్వంగా తిరుమలనాథస్వామి రథోత్సవం


రథంపై కొలువుతీరిన శ్రీదేవి, భూదేవి సమేత తిరుమలనాథస్వామి


రాజంపల్లిలో రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

పెద్దారవీడు: మండల పరిధిలో చట్లమిట్ల పంచాయతీ రాజంపల్లి గ్రామం సమీపంలో వెలసిన గొడ్రాలికొండ తిరుమలనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ ప్రాంగణంలో శ్రీదేవి, భూదేవి సమేత తిరుమలనాథస్వామి రథోత్సవం సోమవారం సాయంత్రం కనుల పండువగా నిర్వహించారు. అర్చకులు భవానీప్రసాద్ ఆధ్వర్యంలో స్వామి అమ్మవార్ల మూల విరాట్‌లకు ప్రత్యేక పూజలు చేసి పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలు, పూలమాలతో అలంకరించారు. రథం ముందు కుంభంపోసి గుమ్మడికాయతో అర్చకులు దిష్టి తీశారు. సాయంత్రం ఉభయ దేవేరులతో కలిసి తిరుమలనాథస్వామి ఉత్సవమూర్తిని రథంపై కొలువుతీర్చారు. ఆలయ ప్రాంగణంలో రథోత్సవం భక్త జనసందోహం నడుమ వైభవంగా జరిగింది. స్వామి వారి నామస్మరణతో భక్తులు పులకించిపోయారు. ఊరేగింపుగా వస్తున్న స్వామి వారిని వందలాది మంది భక్తులు దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఊరేగింపు అనంతరం స్వామి, అమ్మవార్లను రథం నుంచి కిందకు దించి ఊరేగింపుగా ఆలయానికి చేర్చారు. సాయంత్రం మహిళలు కోలాటం ప్రదర్శించారు. భక్తుల కోసం అన్ని కులాల సత్రాల్లో అన్నదానం ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. వైఎస్సార్ సీపీ నాయకుల ఆధ్వర్యంలో విద్యుత్ ప్రభపై పాటకచ్చేరి ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ పీ అనిల్‌కుమార్ పర్యవేక్షణలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.


ఆలయ ప్రాంగణంలో కోలాటం వేస్తున్న మహిళలు


స్వామిని దర్శించేందుకు క్యూలైన్‌లో భక్తులు

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు


క్షతగాత్రున్ని 108లో తరలిస్తున్న దృశ్యం

టంగుటూరు: రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని వల్లూరు గ్రామ జాతీయ రహదారిపై సోమవారం సాయంత్రం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు జరుగుమల్లి మండలం సాదువారిపాలెం గ్రామానికి చెందిన కాకర్లమూడి మాధవరావు స్వగ్రామం నుంచి ద్విచక్ర వాహనంపై ఒంగోలు వెళుతుండగా వల్లూరు పేస్ కాలేజీ సమీపంలో జాతీయ రహదారిపై వచ్చే సరికి వెనుక నుంచి కారు అతివేగంగా ద్విచక్రవాహనదారుడిని ఢీకొనగా మాధవరావు కిందపడి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఒంగోలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగమల్లీశ్వరరావు తెలిపారు.

బీజేపీ ఆధ్వర్యంలో వికసిత్ భారత్

గిద్దలూరు రూరల్: బీజేపీ ఆధ్వర్యంలో పట్టణంలోని సాయిబాబా మందిరం ఆవరణలోని ఫంక్షన్ హాల్‌లో సోమవారం వికసిత్ భారత్ సంకల్ప కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా సెగ్గం శ్రీనివాసులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు ప్రయత్నించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అప్పిసెట్టి ఉదయ్‌శంకర్, నారాయణ, పిడతల రమేష్‌రెడ్డి, గుమ్మారాముడు, తదితరులు పాల్గొన్నారు.


టంగుటూరులో వేలం

210 బేళ్లు తిరస్కరణ

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో సోమవారం నిర్వహించిన వేలంలో బేళ్లు తిరస్కరణకు గురైనట్లు వేలం నిర్వహణ అధికారి జి. సునీల్ కుమార్ తెలిపారు. క్లస్టర్ పరిధిలోని మూగచింతల, గుర్రప్పడియ, నెన్నూరుపాడు, చతుకుపాడు, కె.అగ్రహారం గ్రామాలకు చెందిన రైతులు 936 బేళ్ల వేలానికి తీసుకురాగా 726 బేళ్లను కొనుగోలు చేశారు. వ్యాపారులు వివిధ కారణాలతో 210 బేళ్లను తిరస్కరించారు. గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.180, సరాసరి ధర రూ.246గా నమోదైంది. వేలంలో 18 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రం పరిధిలో సోమవారం నిర్వహించిన వేలంలో 218 పొగాకు బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. జమ్ములపాలెం, తుమాడు గ్రామాలకి చెందిన రైతులు 808 బేళ్లను వేలానికి తీసుకురాగా వాటిలో 590 బేళ్లను కొనుగోలు చేసి 218 బేళ్లను తిరస్కరించారు. గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.180, సరాసరి ధర రూ.242.32 పలికింది. వేలంలో 23 మంది వ్యాపారులు పాల్గొన్నారని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.